ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

# ప్రాంతీయ అస్థిత్వవాద నేపథ్యంలో సీమకథలలోని మిట్టూరోడి విలక్షణత

**డా. టి. జాన్ కిరణ్ బాబు**

అకాడెమిక్ ఆఫీసర్, కళాశాల విద్య కమీషనరు వారి కార్యాలయం,
మంగళగిరి, ఆంధ్రప్రదేశ్, 9440382140, 9182324062.

**Article Received: 18/12/2024 Article Accepted: 15/01/2025 Published Online: 21/01/2025**

**DOI:10.53414/Sahithyatharangini.2025.2102**

**స్థూలాంశం:** "ఒక భౌగోళిక ప్రాంతం లేదా ఉప ప్రాంతంలోని లేదా భాషా ప్రాంతంలోని ప్రత్యేక లక్షణాలను, భావాలను, విశ్వాసాలను ప్రతిఫలించే నిర్దిష్ట లక్షణాలను ప్రాంతీయ ఆస్తిత్వంగా స్థూలంగా నిర్వచించవచ్చు" (కేతు విశ్వనాథరెడ్డి:2013). స్థానికత, ప్రాదేశికత, ప్రాంతీయత అంటూ వివిధ రీతులుగా వ్యవహరింపబడే ఈ పదప్రయోగాలు నిర్దుష్టమైన అర్థంలో మాత్రం ఒకదానికి మించి మరొకటి విశాలమైన అంతరార్థం గలవి. ఒక నిర్దుష్టమైన భౌగోళిక ప్రాంతం యొక్క భౌతిక జీవితం, పర్యావరణ వైవిధ్యం, సహజవనరులు, జీవన శైలి, వాతావరణ స్థితిగతులు, సామాజిక వైరుధ్యాలు, జీవనోపాధికి మూలమైన వివిధ వృత్తులు, సామాజిక పరిణామాలు, భాషాభేదాలు, సంస్కృతీ సంప్రదాయాల వంటివి ఆ ప్రాంతీయ అస్థిత్వాన్ని చాటిచెప్పే కారకాలు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల సమస్యలను, స్థితిగతులను విభిన్నకోణాలలో ఆవిష్కరిస్తూ, వానిని బలంగా వినిపిస్తూ వచ్చిన సాహిత్యాన్ని ప్రాంతీయ అస్థిత్వవాద సాహిత్యం అంటాము. అత్యాధునికవాదం, ఆధునికానంతరవాదం, నవ్యోత్తరవాదం, ద్రవాధునికత వంటి అత్యాధునిక అభివ్యక్తులతో ఆస్తిత్వవాద కథానిక ప్రక్రియ తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తోంది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోక, ప్రగతిపథంలో వెనుకబడి, మనుగడ ప్రశ్నార్థకమైన ప్రాంతాలు ఆస్తిత్వవాద స్ఫూర్తితో తమ ఉనికిని నిలబెట్టుకోవడానికి, కారకులను నిలదీయడానికి సాహిత్యాన్ని ఒక బలమైన ఆయుధంగా మలుచుకున్నారు. ఆ క్రమంలో వెల్లువలా వచ్చిన పదునైన అభివ్యక్తీకరణలే సీమకథలు.

**కీలకంశాలు:** రాయలసీమ ప్రాంతీయ అస్థిత్వవాద వాదం - సీమలు - మిట్టూరోడి విలక్షణత.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

రాయలసీమ పేరు చెవిన పడగానే ఫ్యాక్షనిజం, బాంబుల సంస్కృతి, రాజకీయ ముఠాకక్షలు, కరువుకోరలు, వర్షాభావం, నీటిఎద్దడి, బీడుబారిన పొలాలు, ధాతకరువులు, గంజి కేంద్రాలు, డొక్కలకరువులు, ఆకలిచావులు, వలసలు, రైతుల ఆత్మహత్యలు, విత్తన పంపిణీ కేంద్రాలపై దాడులు, అప్పుల బాధలు, ఉపాధి సమస్యలు, పేదరికం, దారిద్ర్యం, సిమెంటు ఫ్యాక్టరీలు, గనుల తవ్వకాలు, వంతులబావులు, ఆశచావక అప్పు మీద అప్పుచేసి వేసినా నీళ్ళుపడని వందలకొలది బోర్లు, ఈడుకొచ్చినా పెళ్ళికాని పిల్లలు, ఏడాదికి రెండు మూడు మారులకైనా సియ్యాబువ్వకు నోచుకోని గొడ్డుకారపు కడుపులు, చమురులేని చింపిరిజుత్తులు, పేలికలై పోయినా అభిమానానికి పోని అర్ధనగ్నపు దేహాలు, ఆకుకు పోకకు సైతం మానం అమ్ముకునే బతుకులు, బ్రతుకుతెరువు కోసం కువైటు వైపు చూస్తూ దళారీల చేతుల్లో మోసపోయే కూలీలు, వర్షాలకోసం చేసే రకరకాల తంతులు, మండే ఎండలు, ఎడారిని తలపించే బీళ్ళు, తెల్లవారేసరికి ఇసుకమేటలు వేసుకుపోయే పంటపొలాలు, నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, విదేశీ పురుగుమందుల కంపెనీల దాష్టీకాలు కళ్ళముందు కదలాడుతాయి. "ఫ్యాక్షన్ హింసకు చిరునామా రాయలసీమ అనేటువంటి విరుద్ధభావనను కల్పించడంలో ఒకవైపు సినిమాలు, మరోవైపు రాజకీయ నాయకులు కూడా దోహదం చేశారు" (బండి నారాయణస్వామి:2019). అయితే స్థానికంగా ప్రాణాంతకమైన పలు సమస్యలను బయటి ప్రపంచానికి తెలియజేయడంలోనూ, పరిష్కారమార్గాలను చూపించడంలోనూ, మనోధైర్యాన్ని నింపడంలోనూ, కర్తవ్యాన్ని ప్రబోధించడంలోనూ కథారచయితలు మాత్రం తమవంతు పాత్రను నిర్విరామంగా పోషిస్తూనే ఉన్నారు.

సమకాలిక కథకులంతా సీమ బ్రతుకుల్లోని ఆర్ద్రతను,ఆవేదనను, దయనీయస్థితిని చూస్తే, నామిని సుబ్రహ్మణ్యం గారు మాత్రం తద్భిన్నంగా అదే ఒక్కులు ముక్కలు చేసుకునే కష్టజీవుల్లోని శ్రమైక జీవన సౌందర్యాన్ని, బూమమ్మ మంచితనాన్ని, రెక్కల కష్టాన్ని, తుదిశ్వాస దాకా నమ్ముకుని బ్రతికే వ్యవసాయ కుటుంబాల ఆత్మవిశ్వాసాన్ని, సాధారణ జీవితంలో అసాధారణ హాస్యాన్ని చూశారు. అందువల్ల ప్రతీకథ ముగింపులో ఒక కంట నీరుపెట్టిస్తూనే మరోచెంప పొట్టచెక్కలయ్యే నవ్వు పుట్టిస్తుంది.

**కథకుని పరిచయం:** రాయలసీమ కథకులలో చిత్తూరు జిల్లా భాష యాసతో రాసే కథల ద్వారా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కథకులు నామిని సుబ్రహ్మణ్యంనాయుడు. చిత్తూరుజిల్లాలోని తిరుపతికి దగ్గరగా ఉన్న రామాపురం మండలంలోని మిట్టూరు అనే కుగ్రామంలో పేద వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గణితంలో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఉదయం, ఆంధ్రజ్యోతి తదితర పత్రికలలో పనిచేశారు. తాను పుట్టిన ఊరితో,

చెమటోడ్చిన గడ్డతో, అనుబంధం గల వ్యక్తులతో ఉన్న అనుభవాలను కథలుగా మలిచారు. ఆ జీవితానుభవాలే 1985 లో పచ్చనాకు సాక్షిగా, 1987 సినబ్బకథలు, 1990 లో మిట్టూరోడి కథలుగా పాఠకులను రంజింపజేశాయి.

**కథానేపథ్యం:** చిన్నతనంలో ఆడిన ఆటలు, చూసిన మనుష్యుల గురించి చెబుతూనే సార్వజనీనాంశాలనెన్నిటినో ఈ కథలు స్పృశిస్తాయి. పచ్చనాకు సాక్షిగా కథలకు బాల్యంలో 'అమ్మ' కేంద్రం. ఈ కథల్లో రచయితతోపాటు రచయిత తల్లి కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. చిన్నతనం నుంచీ ఆమె కష్టం, ఇంటిని దిద్దుకునే తీరు, పిల్లల్ని పెంచడంలో తపన ఈ కథల్లో కనిపిస్తాయి. "నాకన్నా పున్నాత్ముర్రాలు ఎవురు ఈ లోకమ్మీద? నేనేం వీడికీ, వాడికీ కొంగుపరిచి బతకలా, నా రెక్కల కష్టంతో బతకతా వుండా. నన్ను చిత్రహింసలు పెడితే దేముడికి మారుజల్మ వుండునా ఏమి?" (నామిని:46) అనడంలో ఆ పాత్ర వ్యక్తిత్వాన్ని అర్థంచేసుకోవచ్చు. సవతితల్లి పెంపకంలో బాల్యం ఆవిరైపోతే, పెళ్ళైనాక ఆస్తిభాగాల్లో అన్యాయమైపోయిన భర్తకు మిగిలిన ఒకటిన్నర ఎకరాభూమిలో, ముగ్గురు పిల్లల్ని పెంచడానికి రెక్కలుముక్కలు చేసుకుంటూ రెండుకాళ్ళు ఒక్కచోట పెట్టడమన్నది ఎరగకుండా, కడుపుగట్టుకుంటూ ఆ తల్లి పడే తాపత్రయానికి ప్రతీ సన్నివేశంలోనూ రచయిత హాస్యాన్ని జోడించి నవ్విస్తూనే ఏడ్పిస్తాడు. ఆ తరువాత వచ్చిన 'సినబ్బ కత'లకు హైస్కూలు కేంద్రం. ఆనాటి సీమగ్రామాల్లోని పిల్లల చదువులు, అయ్యోర్లు, ఆటపాటలు, సెలవులు, ఒకవైపు చదువులు మరోవైపు వ్యవసాయ పనులు, వయసుతో పాటు ఎదిగొచ్చే తిమ్మిరి చేష్టలు, ఇంటివాళ్ళముందు, ఊరివాళ్ళముందు చూపే బడాయి పోకడలన్నీ కలగలిపి హాస్యాన్ని మరింత పండిస్తాయి. తదుపరి 'మిట్టూరోడి కత'లకు ఊరు కేంద్రమైంది. పొలంలో పని చేసేటప్పుడు, పశువుల్ని మేతకి తోలుకెళ్తూన్నప్పుడు, చుట్టూ ఉన్న రైతులు, వారి భార్యలు మాట్లాడుకునే మాటలు, పల్లెతోనూ మట్టితోనూ, రైతుతోనూ గల జీవన సంబంధాలు ఈ కథల్లో నోరారా నవ్విస్తాయి. ఈ కథల్లో ప్రతీపాత్రకూ ఒక వ్యక్తిత్వం ఉంటుంది. ఆ వ్యక్తిత్వాలతో, బలాలతో, బలహీనతలతో, గుణాలతో ఒక్కో మనిషి సజీవంగా మన కళ్ళముందు తిరుగాడుతున్నట్టే అనిపిస్తుంది. ఈ కథలన్నీ రాశాక బొమ్మలు, ముఖచిత్రం గీయమని ప్రముఖ చిత్రకారుడు బాపుగారి వద్దకు పంపిస్తే "రోజూ చూసే బ్రతుకులో మీకు ఇంతటి అందం, చమత్కారం కనబడుతోందంటే అది దేవుడిచ్చిన వరం. మీరు ఎంత సాధారణ విషయమైనా అసాధారణంగా రాస్తారని తెలుసు" అని తెగ పొగిడేశారంట .

**మాండలిక ప్రయోగం:** ఈ కథలతో పాటు నామినికి కథారచయితగా విశేషమైన ఖ్యాతిని తెచ్చిపెట్టింది ఆయన ఉపయోగించిన యాసే. సాధారణంగా మాండలికభాషలో కథలు రాసే రచయితలు పాత్రల సంభాషణలను మాండలికంలో పలికింపజేసి, కథనం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

మాత్రం వ్యావహారిక/ప్రామాణిక భాషలో నడిపిస్తారు. కానీ నామిని మాత్రం కథనంతా ఒకే యాసతో నడిపించి రాయలసీమ మాండలికాన్ని పరిపూర్ణంగా, కళాత్మకంగా నిర్వహించారు. మిట్టూరోడి కథల్లోని భాషంతా సరళమైన గ్రామీణభాష. పల్లెజనులు ఎలా తమలో మాట్లాడుకుంటారో ఆ భాషలోనే రాయడం వలన కథలు సూటిగా పాఠకుల మనసుల్లోకి చొచ్చుకుపోయి తిష్టవేశాయి. మళ్ళీ మళ్ళీ చదవాలనిపించేటట్టు చేశాయి. ప్రతీ కథలోని తమని తాము వెతుక్కుని గుండె తడిచేసుకున్నారు పాఠకులు. బాల్యాన్ని తడుముకున్నారు. పరమ పచ్చిగా పల్లెజీవితం . . . దరిద్రం. .. తల్లీ బిడ్డల ప్రేమానుబంధం తిరుపతి మిట్టూరు మాండలికం సాక్షిగా సాగే ఈ కథలు తెలుగు పాఠకలోకాన్ని ఒక ఊపు ఊపాయి.

దీగూడు, కయ్యాగాలవ, మిడిమేలంగా, ముదిగారం, కూటేళ, వూరుబిండి, సంగటి కవళాలు, సలిబిండీ, బైసాట్లు, మొగలాయిలా, బటువుగా, పెశండం, వుక్కిష్టం, కొంద్రలు, లిక్కి, కూట్నీళ్ళు, సంబళం, మునాశ, సోలుపులు, కేరేజాట్, వొప్పీరం, యాసండం, పిడస, పోబిడి, కూటి బొవాని, వరనాతన, మనుబడికి, సత్తుమానం వంటి పదాలు కథలకు ప్రాంతీయ తత్వాన్ని తేగా, . . వొబ్బిడి జేసుకుని, మతింపుగా బతికి, నరగావు అడగతా, గసపోసుకుని, జెమ్మాచారంగా, అయిపూడిస్తా, నా పొవ్వాకు చూపిస్తా, గోగ్గాయల నస, చిటా అనిపించి, గుల్లేరి పొయ్ నాయ్ , అసింక పడ్డం, ఒళ్ళు తెలవకుండా, వూడికాడిపించడం, యాష్టపోవడం, గొంతుకూర్చొని, సందెడు జవురుకొని, మెట్టుతో కొట్టడం వంటి ప్రయోగాలు ఆ అస్థిత్వాన్ని మరింత ద్విగుణీకృతం చేశాయి.

**సీమ నుడి – నానుడి – పలుకుబడి:** రాయలసీమ ప్రజల జీవనంతో అవినాభావ సంబంధం గలిగిన నుడులు, పలుకుబడులు, సామెతలు అడుగడుగునా కథాబలాన్ని మరింత పటిష్టం చేస్తాయి. పచ్చనాకు సత్తెంగా, ఏ గంప కింద మూసిపెట్టేది, మానం చెడ్డ బతుకు, చచ్చి సున్నమైనా, పైన దగద్దమానంగా మండేవోడికే తెల్సు, గుండెకాయలు నీళ్ళైపోయినాయ్, నెత్తిన బండ బడిపోయింది, కాల్తో చెప్పిన పని చేత్తో చేస్తా, అగుమానంతో పిడికిడైపోయినా, తూరూగా పుట్టే సూరీడు పరంటగా పుట్టినా, నీళ్ళు లేని బాయిలో దూకి నడుములిరిగి సస్తే మేలు, కడుపా రాయల చెరువు తూమా, పుట్టినాను పుట్టుడాముదాలకు చేటుగా, ఈడ ఎగిరి ఆడ దూకుతాడు, మానం దీసి కానగమాకులకు కట్టేసి, ఉప్పున బెట్టి పప్పున పామి, ముండామొకాన యెండా గాసి, పటంగట్టి పూజలు చేస్తా వంటి పలుకుబడులు. . . కుంచమంత కూతురుంటే తల్లి మంచం దిగాల్సిన పనిలేదు, ఉత్తరం కొండను దక్షిణం కొండను దొర్లించి పిండిజేసే రకం, కాకి చేతికి మిరప్పొండు, అరవా కొరవా కాపరాలకు అంగిడి బియ్యం తంగేడు కట్ల, నా బతుకు నీటికన్నా పలసన దూదికన్నా సులకన, వేసింది తిని పోసింది తాగిపోయే రకం, ఎండలు గాసే బూమండలం మీద ఎట్టా బతుకుతావు వంటి సామెతలు రాయలసీమ గడ్డతో

భౌగోళికంగా, సాంస్కృతికంగా, చారిత్రకంగా ఎంతగానో ముడిపడి వున్న జీవన మర్మాలు. (మిట్టూరోడి పుస్తకం – నామిని:2013).

నామిని సుబ్రహ్మణ్యం గారు తన భాషనూ, ఊరునూ, తన చుట్టూ ఉన్న మనుషుల్ని మనసా వాచా కర్మణా ప్రేమించారు. అందుకే మర్యాదలకు, భేషజాలకు పోకుండా నిజాయితీగా ఉన్నది ఉన్నట్టుగా చెప్పి కథలో సన్నివేశాలకు, పాత్రలకు ప్రాణం పోశారు. భాష ఎంత లోతుగా తెలిస్తే ఆ మనుషులు అంత లోతుగా తెలుస్తారన్నది నామినిగారి నిశ్చితాభిప్రాయం. ఇంకో అడుగు ముందుకేసి భాష పైపైన తెలిసినవాడికి మనుషుల గురించీ తెలియదు. నేను మా ఊరుమింద, మా అమ్మమింద రాస్తున్నప్పుడు వేరే భాషలో ఎట్టా రాసేది అని ఎదురు ప్రశ్నిస్తారు. పైగా మాండలికంలో రాయాలనే ప్రత్యేకదృష్టితో ఆయన కథారచనకు ఉపక్రమించలేదు. ఇంకా చెప్పాలంటే ఆయన కథలు లోకం మీదికి వెళ్ళాకే వచ్చిన ఉత్తరాలను బట్టే మాండలికం అన్న మాట ఒకటుందని తెలియలేదంటారు. మాండలికంలో రాస్తే పేరొస్తుందని రైతు చేతుల్లో పురుగుమందు డబ్బాలు పెట్టేసి రాసేస్తే ఎట్టా అని సమకాలీన కథా రచయితల్ని నిలదీశాడు. నాకు బతుకు ముఖ్యం. ఆ బతుకు నాకు లేనప్పుడు, ఆ బతుకు నేను బతకనప్పుడు, వాటిని తెచ్చి అంటించుకుంటే తప్పు కదా. . . రాస్తే కొనా మొదటికి బాగుండాల. అక్కడక్కడ రెండు బిట్లు బాగుంటే ఎట్ల అన్నది వారి నైతిక కట్టడి.

కథారచయితగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన తొలినాళ్ళలో 'అప్పటిదాకా తెలుగుసాహిత్యంలో అంతగా వాడని పదాలని యధేచ్ఛగా వాడేశావే . . . అంతా ధైర్యం ఎలా వచ్చింది?' అన్నది ఆయన ఎదుర్కొన్న విస్మయపూరిత ప్రశ్న. అప్పటిదాకా రైతు రచయితలుగా చెలామణి అయ్యేవారంతా తమ కథల్లో రైతుల్ని, రైతుల భార్యల్ని, రైతుల బిడ్డల్ని హింసలు పెట్టారు. వీళ్ళెవ్వరూ రైతుల గురించి నిజం రాయలేదు. అంతా జూటా రాతలు. ఆ కసితోనే నిక్కచ్చిలాంటి రైతుజీవితాన్ని చూపించడానికే నిప్పులాంటి రైతుభాషనూ వాడానని అంటారు. కథాగమనంలో సందర్భోచితంగా పడే ఆడోళ్ళ తిట్లు, మొగోళ్ళ తిట్లు యథాతథంగా కనిపిస్తాయి. పచ్చనాకు తొలికథలోనే నా బట్టా అని రాస్తే . . . దేవుణ్ణి కూడా తిట్టిన ఆ తిట్లు ఆక్షేపణకు గురైనప్పుడు. . . చిత్తూరు మొదలుకుని శ్రీకాకుళం దాకా ఆయాతిట్లు, పరాచకాలకు వాడే పదాలు చిన్న చిన్న తేడాతో అంతటా వ్యవహరింపబడుతున్నప్పుడు మర్యాదలకు పోయి, ఎవరో విమర్శకుల కోసం మాట్లాడుకునే భాషనే మార్చి రాయడాన్ని ఒప్పుకోలేదు. ప్రజల కమ్యూనికేషన్ అద్భుతం. అది పట్టుకోవాల. వాళ్ళతో కమ్యూనికేట్ కాకపోతే రాసేదంతా వేస్ట్ అన్నది ఆయన అంటిపెట్టుకునివున్న సామాజిక సూత్రం. రైతు సాహిత్యం రైతులకీ, రైతులను గురించి ఆలోచించేవాళ్ళకీ ఒక బైబిల్ మాదిరి వుండిపోవాలి. అటువంటప్పుడు ఆ రైతుమాటలు, ఆ రైతు భాష సాహిత్యంలోకి రాకపోతే సౌందర్యం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ఏముండాది? అని నిలదీస్తాడు. రచయిత ఘోషించినట్టు యావాదాంధ్ర యాసలలో కనిపించే పలురకాల తిట్లు అధునాతన యుగంలో అనాగరిక, అమర్యాదకర ముసుగు క్రిందికి జమకట్టడం చూస్తూనే ఉన్నాం. అత్యాధునిక పోకడలకి అతీతులైన శ్రమజీవుల ఆ పరాచకాల భాషను రచయిత దృష్టికోణంలో నుంచి చూస్తే ఎంతమాత్రం విస్మరించలేం. పచ్చనాకు సత్తెంగా రైతుల పక్షాన నిలబడి ప్రజానాడిని పట్టిన రచయిత కావడంచేతనే ఆయన కథలు విశేష ఆదరణకు నోచుకున్నాయి. తెలుగు కథానికా సాహిత్యంలో ఒక కొత్త ఒరవడికి ఆయనే మార్గదర్శకుడు. నామిని శైలిని ఆ తర్వాత తెలుగులో చాలామంది అందుకున్నారు. అందర్నీ పాఠకులు ఆదరించారు. ఖదీర్ బాబు, సోమరాజు సుశీల, గోపిని కరుణాకర్, వంశీ, ఎండ్లూరి సుధాకరర్ వంటి వారి కథలు పదేపదే నామినినే గుర్తుకు తెస్తాయి.

జీవనపోరాటంలో గెలుపోటముల్ని ఒకేలా భావించుకుంటూ, బ్రతుకంతా నేలతల్లిని, రెక్కలకష్టాన్ని నమ్ముకుని, శ్రమతో, సంతృప్తితో, నాగరకత సంస్కృతుల్ని మోసుకుంటూ పోతున్న మిట్టూరు కుగ్రామ జీవితాన్ని నామిని అక్షరబద్ధం చేయడంతో తెలుగుకథా సాహిత్య చరిత్రలో ఒక కొత్త ఆవిష్కరణకు తెరతీసినట్లయ్యింది. అత్యంత గడుసుదనంతో, సాహితీ విలువలకు ఎక్కడా లోటు రాకుండా, గాలిలో సాముగారడీలు చేయకుండా, పూర్తిగా నేలమీదే నడుస్తూ అటు మాండలికంలోనూ, ఇతి కథావస్తువుల ఎంపికలోనూ హాస్యం ఎరులై పారుతూ వుంటే చిక్కటి జీవితపు వాసనతో కథలన్నీ చెప్పడం విశేషం. సందర్భానుసారంగా నామిని ఊరి ప్రజలు, ఇంటి చుట్టుపక్కల వున్న అమ్మలక్కలు, అయ్యవార్లు జీవిత సారమంతా బోధిస్తుంటారు. అక్కడక్కడా తల్లులు పిల్లలకు, మరికొన్నిచోట్ల పిల్లలు తల్లులకు మొత్తంగా ప్రతిచోటా వారంతా కలసి మనకు పాఠాలు నేర్పిస్తూనే ఉంటారు. (దుప్పల రవి కుమార్:2008). అందుకే కాళీపట్నం రామరావుగారు నామినిని నా ఏకలవ్య శిష్యుడని ప్రకటించుకున్నారు. రంగనాయకమ్మగారు నామినిని ఆంధ్రాగోర్కీని చేశారు. "అసలు ఇదంతా నా ప్రతిభ కాదు. . . నా రెక్కల కష్టం. . . వొకటిన్నర ఎకరా రైతుకి పుట్టినాను కాబట్టే నేను ఈ కతలు రాయగలిగినాను. అయిదెకరాల రైతుకి పుట్టింటే నా కతలు పచ్చి జూటా కతలయ్యేవి. వొకటిన్నర ఎకరాలలోనే జీవితమంతా వుంటింది. దాన్ని యాజిటీజ్ గా పట్టుకున్నాను. అదే నా కతల సౌందర్యం" అని ఫిలాసఫీ చెబుతారు. (ఆర్. ఉమామహేశ్వర రావు:2009) నామినికి పూర్వం కాంతం కథలు, అమరావతి కథలు, పెన్నేటి కథలు, మా గోఖలే కథలు వస్తే, నామిని తర్వాత దర్గామిట్ట కథలు, మాదిగోడు, శ్రీకాకుళయ్య కథలు మొదలైనవి పూర్తిగానో, దాదాపుగానో ఒక వ్యక్తినో, స్థలాన్నో, సామాజిక వర్గాన్నో కేంద్రంగా చేసుకుని విస్తరించిన కథాసాహిత్యమే. నామినిది ప్రధానంగా ఆత్మాశ్రయ దృష్టి. నామిని కథల్లో రసానుభూతి మూలకం యాదార్థత. రచయిత కంటే జీవితం గొప్పది అని రుజువు చేసిన కథారచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడు.

**ఆధార గ్రంథాలు:**

మిట్టూరోడి పుస్తకం (2013)- నామిని, టామ్ సాయర్ బుక్స్, 209, అన్నమయ్య టవర్స్, యాదవ
కాలనీ, తిరుపతి – 517501

మీరు చదివారా? పుస్తక సమీక్షలు (నవంబరు 2, 2008) – మట్టివాసనకు ఆనవాళ్ళు నామిని కథలు:
దుప్పల రవికుమార్)

మా ఊరు: (2009) ఆర్. ఎమ్. ఉమా మహేశ్వరరావు- తల తిమురుబట్టిన నామిని కత (పచ్చనాకు
సాక్షిగాకి పాతికేళ్లు – ఉమాటిపిటి బ్లాగ్ స్పాట్)

సారంగ సాహిత్య వారపత్రిక (జూలై 31, 2013) – ప్రాంతీయత వల్ల కథ విశాలమైంది: కేతు విశ్వనాథ రెడ్డి

ఆంధ్ర జ్యోతి (జనవరి , 2017) – రాసేవోడెప్పుడూ నేర్చిన మాటలు మాట్లాడకూడదు: నామిని ఇంటర్వ్యూ మెహర్ తో )

సారంగ సాహిత్య వారపత్రిక (జూలై 15, 2019) – రాయలసీమ నా భౌతిక జీవితానికి కేంద్రం: బండి
నారాయణ స్వామి.